
# క్షణికం




నష్టమాలింగం B.Sc.,

పరధ్యానంగా నడుస్తున్న పరంధామయ్యగారి కళ్ళు పచ్చనోటుపై బడేసరికి మిలమిల్లాడాయి మిట్టమధ్యాహ్నం. రోడ్డుప్రక్క తనకోసమే వేచినట్లు పడివుంది; తన అదృష్టం కాకపోతే మరి ఏమిటి! ఒకటా, రెండా, వంద రూపాయలు!!! తన బడిపంతులు జీవితసహారాలో చిన్న ఒయా

...న్నాన్న. అటుయిటు పరకాయించి నోటు తీసి లాల్చీజేబులోకి పోనిచ్చాడు. ఉత్తుంగ హిమాచలాన్ని 'టెన్సింగ్' అధిష్ఠించి నపుడు అతనికి కలిగిన అనుభూతీ ఆనందం కలిగింది మాష్టారికి.

ఎండవేడికి లేచిన మృగతృష్ణికా ప్రవాహాల్లా సాగుతున్నాయి మాష్టారి ఆలోచనలు. ఈ సంగతి భార్య పర్వత వర్ధనమ్మకు చెప్పాలి. చెప్తే ఎంతగానో సంతోషిస్తుంది. అసలు యీమధ్య తను, ఏ విషయం భార్యతో సమంగా చెప్పడమే లేదు. కారణం, ఏముంది. చాలీచాలని సంపాదనతో నిత్యం సతమతమవు తూన్న జీవన నాటకంలో, భార్యతో ముచ్చటించే మధురాంశా లేమున్నాయి గనక! కొడుకు రమాకాంతం మార్చిలో పరీక్ష యిచ్చి, బి. యే. పాసయితే ప్రెసిడెంటుగారి చలవవల్ల తన స్కూలు లోనే అసిస్టెంటుగా వేయించుకోవచ్చు. అంతకంటె పైకి చదివించే స్థోమత తనకులేదు.

ఊళ్లో కాలేజి గనక అవ్వో సవ్వో జేసి జీతం కట్టగలుగుతున్నాడు. చేతులో సర్దుబాటు లేక రమాకాంతానికి కాలేజి ఫీజుకని నిన్ననే వంద రూపాయలు అప్పు చేశాడు రాఘవయ్యమాష్టారివద్ద. విధిబలం గాకపోతే యీరోజే, 'పరం ధామయ్యా! నిన్న చేసిన అప్పు తీర్చేయ్!' అన్నట్లు వంద రూపాయలు తనకు దొరకడ మేమిటి? అయినా రాఘవయ్య మాష్టారి అప్పుకు తొం రేమిటి? ఎలా యిచ్చినా యివ్వచ్చు: ఉన్నవాడు. 10 ఎకరాల మాగాణిపొలం మూలుగుతున్నది. వడ్డీ గుంజుతూ మాష్టారి సన్నిధి చేరేది రొఖం 10, 15 వేల పైమాట. పిల్లా! పీచా! అసలీ సొమ్ము సంతోషదాయకంగా ఖర్చు చెయ్యాలని మొదటినుంచీ తన కని పిస్తూనే వుంది. పర్వతం కంచిపట్టుచీర కోసం కలలుగనడం ప్రారంభించిన తర్వాత పది వసంతాలు చిగిర్చాయి. ఆ కోరిక ఎప్పుడు తీర్చగలడు గనక. యీ అవకాశం మళ్ళీ లభించదు. పెద్ద పిల్ల సావిత్రి కాపురానికి వెళ్ళినదాది ఏడాదికో చీర పండగకి పెట్టడమే గగన మవుతూంది. హనుమడి బారసాలకి వుంగరం చేయిస్తానని యిచ్చిన వాగ్దానం అలానే వుంది. యీ 'బంగారం నియం త్రణ' లేకుంటే వాగ్దానం నిలబెట్టుకునే అవకాశమే మరి — రమాకాంతం; 'స్మగుల్డు వాచీలు చవగ్గా వస్తున్నాయిట' అని మనసులో కోరిక వ్యక్తీకరించి నెల పైబడ్డది. తానయితే జేబుగడియా రంతో సరిపెట్టుకున్నాడు గాని రమా కాంతానికేం 'కాలేజీ స్టూడెంటు'; బియ్యే పాసయితే ఐదువేలకి ఏమాత్రం తక్కువగాని కట్నం తేగల సమర్థుడు. చిన్నకూతురు హేమాంగిని ఓ యింటి దవాలంటే ఆ విధంగా వాడి ఆసరా అవసరం. వాడికి వాచీ వుండదగ్గదే.




పెళ్ళిలో మామగారు పెడ్తారులే అని సర్ది చెప్పాడు. ఈ ఆలోచనాపరంపరలో తన సంగతే మర్చిపోయ్యాడు. తెల్లటి గ్లాస్గోమల్లు ధోవతీ, బిన్నీ అచ్చ సిల్కు లాల్చీ వేసికొని, బద్దికమ్మి కండువాతో జీవితమంతా రీవిగా గడపాలని తన కెన్నాళ్ళనుండి కోరిక లేదు! నీట్‌గా డ్రెస్ చేసికొని, కాలేజికి పోయే వాళ్ళను చూచి త నెన్నిసార్లు అసూయ పడలేదు. ఈసారి తప్పక నాలుగు ధోవతులు వాటిపైకి లాల్చీలు కండువాలు తీసికోవాలి – ఈ ఆలోచనలకు అంతేలేదు. పై పట్టీ పూర్తి కావాలంటే యిలాంటి వందలు చాల కావాలి. ఉదయం స్కూలుపని ఒక గంటతో అయిపోవడంవల్ల చాలా తీరికగావుంది. వ్యవధిగా ఆలోచించుకోవచ్చు నను కున్నారు మాస్టారు ఓవరిగా.

Morning hours అన్నీ cancel అవడంతో College fees కట్టే వుద్దేశ్యంతో బయలుదేరాడు రమాకాంతం. కాలేజికి చేరేసరికి మధ్యాహ్నమయింది. Office Room Cash Counter దగ్గరికి వెళ్ళాడు Fees కట్టడానికి. Shakespeare, 'Much Ado about Nothing' Drama పుస్తకం తెరిచాడు, తాను అందులో వుంచిన వందరూపాయిల కరెన్సీ నోటుకోసం. అందులో వుంటేగదా కనబడ్డానికి! త్రోవలో లోలాకుల వెంబడి తన అక్షర విన్యాసపు చమత్కృతీ, కనుసైగల సొంపూ ప్రదర్శనయిచ్చిన ఘట్టం హృదయఫలకంపై మసక మసకగా మెదిలింది.

ఆ రసవద్ఘట్టంలోనే నోటు జారి వుండాలి. కళ్ళు చీకట్లు కమ్మాయి; భూమి తిరిగింది; మతిచలించినంత పనయింది. పుస్తక మంతా తిరగవేశాడు ఫలితం శూన్యం. 'ఇంటిలో వదిలిపెట్టివచ్చావేమో చూడండి,' అన్నారు యిద్దరు ముగ్గురు సహాధ్యాయులు. అతని అవస్థాభేదాన్ని

గమనించి, విషయం తెలుసుకొని. తనకంతా అయోమయంగా వుంది. ఇంటికెళ్ళి ఏం సమాధానం చెప్పగలడు ఈ చేదుమాత్ర ఎలా మింగడం. 'నమో వెంకటేశా! ..' అన్న మంగళగీతం ఎదురుగా వున్న Hotel రేడియో నుంచి వినవస్తోంది. "ఓ వెట్టి రమాకాంతం! అదుగో ఆ ఏడుకొండలస్వామిని మనసా స్మరించి నీ దీనావస్థ విన్నవించు మా నాన్న కోపానలానికి యింధనం కాకు!' అని ఎవరో తన మనసుకు తట్టి చెప్పినట్లయింది అప్పటికి ఆ అవస్థనుండి తప్పించమని అప్పట్లో కాకపోయినా బి యే పాసయి వుద్యోగంలో జేరిన తర్వాత తీసికొన్న మొదటి జీతంతో వెంకటేశుని దర్శనం చేసుకొంటానని మొక్కుకుయిచ్చాడు. వచ్చినదారి పూర్తిగా సర్వే చేసి యిల్లు చేరేసరికి ఒంటిగంట దాటింది. ఏడుకొండలవాని దయకు అతడు పాత్రుడు కానేమో ననుకున్నాడు.

దిగాలుపడ్డ ముఖంతో యిల్లు ప్రవేశించాడు. నాన్నగారు చిరుదరహాసంతో పడకకుర్చీలో పవ్వళించి వున్నారు. అమ్మ కాఫీ ప్రయత్నంలో వుంది. చెల్లెలు హేమాంగిని కథలపత్రికా పఠనంలో నిమగ్నురాలయివుంది. పెళ్ళికాని మధ్యతరగతి యువతుల పాలిటి వరప్రసాదాలీ పత్రికలు అని వేళాకోళం చేసేవాడు చెల్లెల్ని; కాని, అప్పట్లోరిం స్థితివేరు సంగతి బయటపెట్టడమెలాగో అర్థంకాలేదు భగవన్నామ స్మరణ ఆరోజు చేసినన్ని పూర్లు ఎప్పుడూ చెయ్యలేదు అటువంటి అవసరం కలగ లేదుమరి యిదివరలో. 'అబ్బాయీ, జీతం కట్టేశావురా' అన్న పర్వతవర్ధనమ్మ పిలుపుతో విషయం బయటపెట్టవలసిన సమయం వచ్చింది. గుండె వేగం ఆ క్షణాని కాక్షణం హెచ్చవుతోంది. కాళ్ళుకూడా వణుకు పుచ్చుకున్నాయి. 'నోటు పోయిందమ్మా' అని తాను అసలు విషయం బయటపెట్టగలిగాడు. 'ఆఁ' అన్న ఆమె చేతిలో కాఫీ కషాయం గిన్నె క్రిందపడింది

'ఏమిటే అది' అని పరంధామయ్యగారు కేకవేసి వంటింటికేసి రానే వచ్చారు. "అబ్బాయి, జీతండబ్బు వాడేశాట్ట" అని తెల్ల ముఖం వేసింది. క్రోధం, భయం, దుఃఖం రంగరించిన ముఖకవళికతో.

పరంధామయ్యగారికి యీ News ఎలా Receive చేసుకోవాలో అర్థం కాలేదు. యింతకుముందే సహారాలో చిన్న ఒయాసిస్సా. అప్పుడే యిసుక తుఫానా? ఇంతవరకు తాను దాచిపెట్టిన పరమరహస్యాన్ని తానిక వెల్లడించ దలచాడు. "నే హైస్కూలు నుంచి వస్తూంటే లాయరు రంగనాథం యింటి సమీపంలో వందరూపాయల నోటొకటి దొరికింది. కొంపతీసి నువ్వు పారేసుకున్నది కాదుగదా! రాఘవయ్య మాష్టారి దగ్గర నిన్నరాత్రి తెచ్చి మీ అమ్మకిచ్చాను నోటు ఏమోగుర్తుకూడా లేదు." లాల్చీజేబులోంచితీసి నోటు రమాకాంతానికిచ్చారు.

'పరంధామయ్యా! ఎన్ని పగటి కలలు కన్నానయ్యా' అని వెక్కి ఏడ్చని



నట్లు కనిపించింది మాష్టారికా నోటు.

"మీ Class-mate రంగనాథంగారి పుత్రికారత్నం సుశీల దర్శనాభిలాషతో వారి భవంతి ప్రాంగణము ముంగిట ఈలవేసుకుంటూ పచార్లు చేస్తున్నప్పుడు రీలగా జారుకున్నాను. నువ్వు గమనించలేదు రమాకాంతం." అని హెచ్చరిక చేసినట్లు తోచింద్ది రమాకాంతానికి.

"సర్వమంగళకరుడు ఆ వెంకటేశ్వరస్వామిని నమ్ముకుంటే నమ్మగాడు. ఏమేమో అనుకుంటాం గాని" అంది తేలికపడ్డమనస్సుతో పర్వతవర్ధనమ్మ.

ఇంత హడావిడి సరకుగొనకుండా పత్రికా పఠనంలో నిమగ్నురాలయిన హేమాంగిని, "అమ్మా సీరియల్ సుఖాంతమే నే! నే ముందే చెప్పాగా!" అంటూ వచ్చింది.

'అవునే అమ్మాయ్! ఆ వేంకటేశ్వరుని కరుణవల్ల అంతా సుఖాంతమే' అంటూ శృతికలిపింది పర్వతవర్ధనమ్మ విషయం పరిస్థితికి అన్వయించుకుంటూ.